
TGTEL/25/A4103

# తెలంగాణవీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.in | హైదరాబాద్ | ఎడిటర్ : కె. శ్రీనివాస్ | సంపుటి:01 | సంచిక:208 | 09 ఆదివారం, ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల: రూ. 3/-

## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

### 15 ఆగస్ట్‌న ప్రారంభించనున్న సిఎం



**నిజామాబాద్,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవు తందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం




- సాగునీటి ప్రాజెక్టులకు 5వేల కోట్లు మంజూరు
- తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు8 (తెలంగాణవీణ):**

సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, ఆర్‌ఆర్ కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణెళి లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్ఖైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## మహిళా బిల్లుపై మాటల యుద్ధం



### కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్

**న్యూఢిల్లీ,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు. దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ.. 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. 'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం బాగా ఎవరికి తెలుస్తుంది? మహిళా రిజర్వేషన్ చట్టం-2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది.

## నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా

- కాంగ్రెస్ అణచివేతకు ఇదే నిదర్శనం
- సరూర్‌నగర్ ఘటనపై మండిపడ్డ రాంచంద్రరావు



**హైదరాబాద్,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్ర బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

## సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ

- డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం
- ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్




**చెన్నై,ఆగస్టు8 (తెలంగాణవీణ):**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' పక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది.

## నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది



- క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు
- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి
- మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,ఆగస్టు8 (తెలంగాణవీణ):**

క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి.




## సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు

- ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు
- రైతులు ఆరుతడి పంటలనే వేయాలి
- సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి

**నల్గొండఆగస్టు8 (తెలంగాణవీణ):**

ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు.

## జలధార – జలహారతి ఇక నిరంతర కార్యక్రమం

- ఎల్‌నినోతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సాగు,తాగునీటితో పాటు, పరిశ్రమలకు నీటి సరఫరా
- పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిందే
- అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి,ఆగస్టు8 (తెలంగాణవీణ):**

జలధార – జలహారతి ఇక నిరంతర కార్యక్రమమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. జలధార – జలహారతిపై సీఎం శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గినా పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

మొదటిపేజీ తరువాయి

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్దం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# మహిళా బిల్లుపై మాటల యుద్ధం

అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు?' అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

మొదటిపేజీ తరువాయి

# నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా

రాహుల్ గాంధీ ఢిల్లీలో 'మొహబ్బత్ కీ దుకాణ్' అని గొప్పలు చెప్తూ, తెలంగాణలో మాత్రం ఉపాధి కోరిన యువతపై లాఠీలు ఝళిపిస్తున్నారని విమర్శించారు. హైడ్రాలో కేవలం 150 ఖాళీల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ తీవ్రతకు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సాక్ష్యమని రామచందర్ రావు అన్నారు. అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, స్వయం ఉపాధికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తు చేశారు. అయితే రెండేళ్లు గడిచినా ఒక్క హామీనీ నెరవేర్చలేదని ఆయన మండిపడ్డారు. హామీలను నమ్మి ఓటేసిన యువతను రోడ్లపాలేసి, కనీసం ఆశతో వచ్చిన వారిపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ యువత ఆకాంక్షలపై అధికారంలోకి వచ్చారో, అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టివేసిందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులపై పోలీసుల ప్రయోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, యువతకు సమాధానం చెప్పాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# జలధార – జలహారతి ఇక నిరంతర కార్యక్రమం

నీటి పొదుపు, వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది సాధారణం కంటే 39 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జూన్ నుంచి డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 867 మిల్లిమీటర్లుగా ఉందని వెల్లడించారు. కాగా.. ప్రస్తుతం 525 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఆగస్టులో 56 శాతం లోటు వర్షపాతం ఉండే అవకాశం ఉందని తెలిపారు. రిజర్వాయర్ల నీటి నిల్వలపైనా ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. ఏపీలోని వివిధ బేసిన్లలో ప్రస్తుతం 563.05 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గతేడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఆగస్టు నుంచి భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తాగునీటి నిల్వలు, సరఫరాపై పక్కా ప్రణాళిక రూపొందించాలని సీఎం మార్గనిర్దేశర చేశారు. వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లలో తాగునీటిని నిల్వ చేయాలని సూచించారు.నాగార్జునసాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాలకు తాగునీటి కేటాయింపులు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. అందుబాటులోకి వచ్చిన నీటిని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. ఆయా ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించి రిజర్వాయర్లు నింపాలని మార్గనిర్దేశర చేశారు. తాగునీటి వసతి లేని ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ సాగులో ఉన్న పంటలను కాపాడాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యం మేరకు వినియోగించాలని మార్గనిర్దేశర చేశారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పంటలను భవిష్యత్తులో ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావంతో పశు గ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు మేత, నీటి లభ్యతను ముందుగానే నిర్ధారించాలని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో గోకులాలను సిద్ధం చేయాలని సూచించారు. పశుసంపద రక్షణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణ నిరంతరం కొనసాగాలని సీఎం తెలిపారు. చాలాకాలంగా నీటి లభ్యత లేని చెరువులు, కాల్వలను గుర్తించి నీరు అందించాలని సూచించారు. అదనపు నీరు ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న ప్రాంతాలకు మైక్రో బేసిన్ అనుసంధాన అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. జలధార – జలహారతి కింద 82,865 పనులు గుర్తించామని.. 79,826 పనులు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. జలధార – జలహారతి కింద రూ.3,409.35 కోట్ల పనులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్లు, ట్రెంచ్‌ల తవ్వకం పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. ముందస్తు ప్రణాళికతో పనిచేస్తే భవిష్యత్తు నీటి సమస్యలను సమర్థంగా ఎదుర్కొవచ్చని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## సిఎం విజయ్ నేతృత్వంలో

# అఖిలపక్ష ఎంపిల భేటీ

మొదటిపేజీ తరువాయి

పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణెళి లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ది చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

మొదటిపేజీ తరువాయి

# సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు

వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు.కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్–ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వె÷–లలెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు.జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకూ పనికిరాకుండా పోతాయని మంత్రి అన్నారు. విపరీతంగా ఎరువులు వాడటం, నిరంతరం వరి సాగు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు 5 వేల యూనిట్ల స్పిం÷–రక్లర్లు కావాలని అధికారులు కోరగా.. తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ భగ్గుమంటది

కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముల్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

------------

# పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఘనంగా స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు

కరీంనగర్, తెలంగాణవీణ

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం స్కూల్ క్యాబినెట్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు క్రీడలు, క్రమశిక్షణ, సాంస్కృతిక విభాగాల లీడర్లు, డిప్యూటీ లీడర్లను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇ–బ్యాలెట్ విధానంలో ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులే బూత్, ఎన్నికల, ప్రిసైడింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించడం విశేషం. ముఖ్య అతిథులుగా ఏసీపీ తంగేళ్ల ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సుగాటి కోటేశ్వర్ రావు, విద్యాసంస్థల అధినేత డా. ఇ. ప్రసాద్ రావు హాజరై విద్యార్థులకు నాయకత్వం, బాధ్యత, క్రమశిక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని అతిథులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్ తదితరులు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శతచండీ యాగంతో ఇందూరు పావనం

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

ఇందూరు:, తెలంగాణవీణ

శత చండీయాగంతో ఇందూరు పావనమైందని, లోక కళ్యాణార్థం యాగం చేయడం అద్భుతమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన శత చండీయాగం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ యాగంతో ఎల్ నినో పరిస్థితులను అధిగమించి మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల యాగం ఫలితం మొదటి రోజే చూశామని సమృద్ధిగా వర్షం కురిసిందని గుర్తు చేశారు. రైతు బాగుంటే అందరూ బాగుంటారని, దేశం బాగుంటుందన్నారు. హిందూ ధర్మంలో మాత్రమే "సర్వే జన సుఖినో భవంతు" అని అంటారని, అందరికోసం వేడుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యాగం నిర్వహణకు కృషి చేసిన అన్ని సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి బోనాల పండుగ వేడుకలు

కమాన్ పూర్, తెలంగాణవీణ

తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన సంప్రదాయ పండుగ బోనాలు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగను లిటిల్ మాస్టర్స్ స్కూల్ -- రొంపికుంటలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాల విశిష్టతను తెలియజేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను చిన్నారులకు పరిచయం చేసి, వాటి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించడం జరిగింది. **స్కూల్ కరస్పాండెంట్:** జంగిలి మల్లేష్ యాదవ్ కొయ్యడ కుమార్ యాదవ్ రజిత కొమలత స్వాతి శృతి భాగ్యలక్ష్మి నిరోష ప్రవళిక అంజలి పాల్గొన్నారు.

# కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...

న్యూఢిల్లీ, ఆగస్టు 8, (తెలంగాణవీణ)

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్టన్ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది. అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి. ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళు గా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

# నేటి ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయండి

## సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు

తెలంగాణవీణ// ఖమ్మం బ్యూరో

ఖమ్మం/బోనకల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండల కేంద్రంలోని తూము ప్రకాష్ భవన్ విలేకరుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఈ నెల 9న బోనకల్ మండలంలోని మోటమర్రి, రాయన్నపేట, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. బ్రాహ్మణపల్లిలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం యాత్ర రాపల్లి వరకు సాగుతుందని చెప్పారు. ఆగస్టు 13న ఖమ్మం నగరంలో పాదయాత్రతో పాటు ముగింపు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు కొంగర భాస్కరరావు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, డిహెచ్పిఎస్ మండల కన్వీనర్ కాకాటి కరుణాకర్, చిరునోముల సిపిఐ గ్రామ కన్వీనర్ గుంపుల జయరాజు తదితరులు పాల్గొన్నారు



# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని చాటిన త్రివేణి విద్యార్థులు

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం,క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకుంటూ త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీజీ ఇచ్చిన "భారత్ విడిచి వెళ్లండి" పిలుపు స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల ఐక్యత, త్యాగానికి ప్రతీకగా నిలిచిందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు జాతీయ పతాకాలతో దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, నినాదాలతో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించు కున్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశభక్తి, ఐక్యత, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను అలవరచు కోవాలని విద్యార్థులకు సూచించారు.డైరెక్టర్ డా. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను భావితరాలకు పరిచయం చేయడం విద్యాసంస్థల బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులు క్రమశిక్షణ, ఐక్యత, దేశసేవ ద్వారా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కాల్ గ్రూప్స్ ప్రముఖ బిల్డర్ సూర్యకృష్ణకు ఘనంగా జన్మదిన వేడుకలు

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం,కాల్ గ్రూప్స్ ప్రముఖ బిల్డర్ సూర్యకృష్ణ జన్మదిన వేడుకలను గాంధీచౌక్‌లోని కాల్ గ్రూప్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుతారి మేస్త్రి నాగేశ్వరరావు, పెయింటింగ్ మేస్త్రి మాచర్ల తిరుమలరావు, కరెంట్ మేస్త్రి నరసింహారావు, సానిటరీ మేస్త్రి రమేష్, కాల్ గ్రూప్స్ సిబ్బంది సూర్యకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేస్త్రిలు మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో వేలాది మంది కార్మికులు, కాంట్రాక్టర్లకు నిరంతరం ఉపాధి కల్పిస్తూ సూర్యకృష్ణ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.అనంతరం సూర్యకృష్ణ మాట్లాడుతూ.. "మీ అందరి ఆశీస్సులే నా విజయానికి కారణం. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మంది కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాల్ గ్రూప్స్ సిబ్బందితో పాటు పలువురు మేస్త్రిలు, కార్మికులు పాల్గొని సూర్యకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు.




# యూనిఫామ్ సర్వీస్ లైన్ ఛార్జీల పై చైతన్య సదస్సు

నేలకొండపల్లి తెలంగాణ వీణ

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం తండా గ్రామం పంచాయతీ పరిధిలో శనివారం మంగాపురం తండా గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రజలకు యూనిఫాం సర్వీస్ లైన్ ఛార్జి వలన కలిగే ప్రయోజనాల గురించి ప్రముఖ విద్యుత్ శాఖ ఇంజనీర్ పవర్ కోటేశ్వరరావు వివరించారు. ప్రజలకు చైతన్యం సదస్సు లో మాట్లాడారు...గతంలో విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలంటే ఎన్నో రకాల ఇబ్బందులు పాలు అయ్యేవారు కొన్ని కొన్ని సందర్భాలలో ఒక్కొక్క కనెక్షన్ కి వేలల్లో నీ ప్రత్యేక సందర్భాలలో లక్షలలో ఖర్చు పెట్టేవారు ఇలాంటి ఇబ్బందులు నుండి ప్రజలకు మరీ ముఖ్యంగా పేదలకు బడుగు బలహీన వర్గాల వారికి ఇబ్బంది కలగకుండా ఉండాలని ఉద్దేశంతోనే ప్రస్తుత ప్రభుత్వము విద్యుత్ యాజమాన్యంతో పరిశీలించి చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన మరియు సులభతరంగా విద్యుత్ కనెక్షన్ పొందే విధంగా ఉండాలని ఉద్దేశంతోనే ఇప్పుడు కొత్త విధానం ద్వారా అంటే యూనిఫాం సర్వీస్ లైన్ చార్జెస్ పద్ధతిలో ఎవరికైనా విద్యుత్ కనెక్షన్ కావాలంటే ఉదా హరణకు గృహావసరాలకు , కమర్షియల్ , వ్యవసాయ కనెక్షన్ కొరకు మరియు ఏ విధమైన కనెక్షన్ కావాలన్నా యూనిఫాం సర్వీస్ లైన్ పద్ధతిలో అమౌంట్ చేరిస్తే సరిపోతుందన్నారు.అసలు యూనిఫామ్ సర్వీస్ లైవ్ చార్జెస్ అంటే ఏమిటి.ఈ పద్ధతిలో గతంలో లాగా అన్ని రకాల అంటే సెక్యూరిటీ డిపాజిట్ విద్యుత్ సర్వీస్ కనెక్షన్ చార్జెస్ ఇంత వరకు వరకు కామన్, ప్పుడు కేవలం డెవలప్మెంట్ చార్జెస్ కు బదులుగా ఈ విధానాన్ని అమలు లోకి తేవడం జరిగినది అంటే కిలో వాట్ ప్రాతిపదికన ఈ చార్జెస్ లెక్క కడతారు , జ్ఞానం గురించి క్షేత్రస్థాయిలో వినియోగదారుడు కి అర్థమయ్యే విధంగా వివరించడానికి చేసే ప్రయత్నం అన్నారు.ఉదాహరణకు ఉరవసరాలకు విద్యుత్ కనెక్షన్ కావాలని ఎవరు అప్లై చేసినా వారికి వారు గృహం కడుతున్న దగ్గరికి విద్యుత్ అధికారులు కనెక్షన్ వారి సొంత ఖర్చులతో ఇవ్వాలి అంటే ఒక కిలోమీటర్ దూరం వరకు అంటే రమారమీగా దాదాపు 20 పోల్స్ కు పైచిలుకు దూరం వరకు విద్యుత్ సంస్థ వారే సొంత ఖర్చులతో లైన్ ఏర్పాటు చేయాలి కేవలం సర్వీస్ కనెక్షన్ కొరకు మీటర్ బాక్స్ తో పాటు ఫోన్ దగ్గర నుండి మీటర్ వరకు సర్వీస్



వైరు విద్యుత్ వినియోగదారుడు తీసుకురావాలన్నారు. అదేవిధంగా ఉదాహరణకు వ్యవసాయానికి కనెక్షన్ కావాలంటే మేము అంటే విద్యుత్ శాఖ వారు ఇవ్వము లేదు ఇప్పుడు కాదు అవకాశం లేదు అనే వాదన వాడవద్దు యూనిఫాం సర్వీస్ లైన్ సిస్టం ప్రకారంగా ఎవరైతే విద్యుత్ కనెక్షన్ కు దరఖాస్తు చేస్తారో అతనికి తప్పకుండా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్ శాఖ వారు అవసరమైతే ఉన్న ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ పెంచాలి ఒకవేళ దగ్గరలో ట్రాన్స్ఫార్మర్ లేకపోతే ప్రత్యేకంగా ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ శాఖ వారి ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు.ఇలాంటి సదుపాయాలు ఎన్నో ఈ సిస్టం ద్వారా ఉన్నాయి కావున విద్యుత్ వినియోగదారులు గతంలో లాగా ఇబ్బందులు పాలు కాకుండా మీరు విద్యుత్ కనెక్షన్ కొరకు ఇప్పుడు ఉన్న యూనిఫాం సర్వీస్ లైన్ చార్జెస్ పద్ధతి ద్వారా విద్యుత్తు కనెక్షన్ కొరకు అప్లై చేయగలరని నూతనంగా విద్యుత్ కనెక్షన్ కోరేవారికి తెలియజేయడమైనది.ఈ యూనిఫామ్ సర్వీస్ లైన్ ఛార్జ్ కేటగిరి ప్రకారం క్రింది విధముగా చెల్లించాల్సి ఉంటుంది గృహ అవసరాలకు అయితే: ఒక కిలో వాట్ వరకు కేవలం 500 రూపాయలు, ఒక కిలో వాట్ నుండి 5వ వరకు 2900 రూపాయలు, 5 నుండి 20 కిలో వాట్ కంటే ఎక్కువ ఉన్నప్పుడు 2009 మందులు మరియు ఒక్కొక్క కిలోవాటికి 1500 రూపాయలు చెల్లించాలి, అదేవిధంగా 20 కిలో వాట్ పై చురుకు ఉన్న వారికి ప్రతి ఒక్క కిలోవాటికి పదివేల రూపాయల చొప్పున చెల్లించాలి. కమర్షియల్ కనెక్షన్ కొరకు అయితే ఒక కిలో వాట్ వరకు వెయ్యి రూపాయలు అదేవిధంగా ఒకటి 1 ఎ నుండి 5 ఎవ వరకు వెయ్యి రూపాయలు మరియు ఒక్కొక్క కిలోవాటికి 1200 రూపాయలు, అదేవిధంగా 5 నుండి 20 కిలో వరకు 5800 మరియు ఒక్కొక్క కిలవాటుకు 2000 చొప్పున చెల్లించాలి, 20 కిలో వాట్ కంటే ఎక్కువ లోడ్ ఉన్న దగ్గర ప్రతి ఒక్క కిలోవాటికి 10000 చొప్పున చెల్లించాలి.ఇదే పద్ధతి ద్వారా వ్యవసాయానికి కూడా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుంది అంటే సర్వీస్ లైన్ ఛార్జెస్ ప్రకారంగా లెక్క చెల్లించినట్లయితే విద్యుత్ కనెక్షన్ శాఖ వారి రైతులకు ఇబ్బంది కలగకుండా కనెక్షన్ ఇవ్వవలెను.ఇదే విధానం ఇండస్ట్రియల్ కి అంటే కేటగిరీ త్రీ మరియు కాటేజ్ ఇండస్ట్రీస్ కు మిగతా అన్ని రకాల కనెక్షన్ ఇవ్వటానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుత విద్యుత్ యాజమాన్య వారు తీక్షణంగా ఆలోచించి మరియు ప్రభుత్వం వారి సహకారంతో ఈ విధానాన్ని రైతులకు మరియు పేదలకు బడుగు బలహీన వర్గాల వారికి అత్యధికంగా ఉపయోగపడే విధంగా ఈ సిస్టాన్ని అమలులోకి తేవడం జరిగింది. కావున ఈ విధానాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలియజేయడమైనది. ఒకవేళ దీనిపై ఎవరికైనా ఎటువంటి అనుమానాలు వ్యక్తం అయితే ముందుగా మీ సమీప విద్యుత్ అధికారులను అడగండి వారు మీకు సరి అయిన సమాధానం ఇవ్వలేని పక్షంలో నేను అనగా పవర్ కోటేశ్వరరావు సెల్ నెంబర్ 9494445616 కు కాల్ చేయగలరు తప్పకుండా నేను మీకు సహకరిస్తారని తెలిపారు.ఈ విధానం అమలు గురించి విద్యుత్ శాఖ ఉన్నత స్థాయి అధికారులు సిఎండి స్థాయి అధికారులు ఎంతో పట్టుదలతో మరియు క్షేత్రస్థాయి లో ఈ విధి విధానం అమలు గురించి తీక్షణంగా ఆలోచిస్తూ అటు ఉద్యోగస్తులకు మరియు క్షేత్రస్థాయిలో ఉన్న వినియోగదారులకు అర్థమయ్యే విధంగా వారి ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నారు కావున విద్యుత్ యాజమాన్యం లో గల ఉన్నత సాయి అధికారులకు, ఒక విద్యుత్ వినియోగదారుడిగా మరియు యావత్ వినియోగదారుల తరపున మరొక్కసారి అభినందనలు తెలియజేస్తున్నాను.

# కంపు కొడుతున్న పాలన..

## వినాయక్ నగర్ కాలనీలో చెరువులా మారిన రహదారి!

## మురుగు కూపంలో వినాయక్ నగర్ కాలనీ...

తెలంగాణవీణ, కాప్రా :

కాప్రా డివిజన్ వినాయక్ సాగర్ కాలనీ ముఖద్వారం వద్ద డ్రైనేజీ సమస్య జఠిలంగా మారింది. వర్షం పడితే చాలు ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీ ప్రధాన అర్చ్ ముందే పెద్ద ఎత్తున మురుగునీరు నిలిచిపోయి గుంతలా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఈ మురుగునీటి వల్ల దోమలు ప్రబలి, అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.గత కొంతకాలంగా ఈ సమస్యతో నరకయాతన అనుభవిస్తున్నామని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ అభివృద్ధిపై ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించే ప్రజాప్రతినిధులు.. కళ్లముందే కనిపిస్తున్న మురుగునీటి సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వినాయక్ నగర్ కాలనీ వద్ద నిలుస్తున్న డ్రైనేజీ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



# భారీవర్షానికి నీట మునిగిన రోడ్డు

## నీటిలో కూర్చుని కార్పోరేటర్ నిరసన

కామారెడ్డి,ఆగస్టు8 (తెలంగాణవీణ):

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో నీటి కుంటలో కుర్చోని బీఆర్ఎస్‌కు చెందిన 46వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మినారాయణ నిరసన తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లా కేంద్రంలోని కామారెడ్డి నుండి కరీంనగర్ జాతీయ రహదారి అయిన స్టేషన్ రోడ్డు లోని పోలీస్ స్టేషన్ ముందు వరద నీరు ఎటు వైపు కుడా వెళ్లకుండా అక్కడే నిలిచి ఉంది. ఒక ప్రధాన రహదారి ఒక కుంట, ఒక చెరువును తలపిస్తూ రహదారి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వరద నీటి కుంట వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కావున ఈ నీటి కుంటతో ట్రాఫిక్ జామై వాహనదారులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇదే దారిలో ఉంది. రోగులు, క్షతగాత్రులు ఎమ్జంగ్÷న్సీ సమయంలో 108 వాహనం, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇట్టి సమస్యను పరిష్కరించకుంటే అక్కడే దీక్ష చేపడతానని స్పష్టం చేశారు.





# సహాయం చేస్తానంటూ... సినీ పక్కీలో దివ్యాంగుడు నుంచి డబ్బులు చోరీ..!

నేలకొండపల్లి/ తెలంగాణ వీణ

నేను దివ్యాంగులకు సహాయం చేసేందుకు తిరుగుతున్నాను...మీ దగ్గర ఉన్న డబ్బులు కంటే అధికంగా ఇస్తాను.. అంటూ సినిమా పక్కీలో దబ్బులు గుంజుకుని పరారైనా ఘటన మండలం లో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షి మరో దివ్యాంగుడు కొరివి వీరయ్య తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రంలో దివ్యాంగుడు స్కూటీలో పెట్రోల్ బంక్ వద్ద ఫోన్ మాట్లాడుతుండుగా...ఓ పల్సర్ బైక్ పై గుర్తు తెలియని యువకుడు (మాస్క్ పెట్టుకుని) దగ్గరకు వచ్చి దివ్యాంగులకు సహాయం చేస్తానని చెప్పారు. అయితే మీ దగ్గర డబ్బులు ఎంత ఉన్నాయో వాటికి మించి అధనంగా సహాయం చేయటం నా అలవాటు అని మాయమాటలు "చెప్పటంతో దివ్యాంగుడు నమ్మాడు...తన జేబులో ఉన్న రూ.15 వేలు నగదు ను తీస్తుండుగా...తానే లెక్కిస్తానని చెప్పి బలవంతంగా గుంజుకుని అక్కడ నుంచి పారిపోయాడు. దీంతో బాధిత దివ్యాంగుడు. తో పాటు, చెన్నారం కు చెందిన మరో దివ్యాంగుడు వీరయ్య లు వారి వాహనాల పై వెంబడించారు. కానీ అప్పటికే బైక్ పై నుంచి పరారైయ్యాడు. దీంతో బాధిత దివ్యాంగుడు బోరున విలపించాడు. బైక్ పై నెంబర్ ప్లేట్ లేకుండా..మాస్క్ లు ధరించి తిరుగుతున్నాడని దివ్యాంగుడు' పేర్కోన్నారు. ఆ పరిసర ప్రాంతాలలో సీసీ పుటేజీ ఆధారంగా మోసగాడు ను పట్టుకోవాలని పలువురు దివ్యాంగులు కోరుతున్నారు. అదే విధంగా నెంబర్ ప్లేట్ వాహానాల ను సీజ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం...

## - అల్వాల్‌లో ఘనంగా ఏఐవైఎఫ్ మండల 3వ మహాసభలు...
## - ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపు






తెలంగాణవీణ, కాప్రా :

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. శనివారం అల్వాల్‌లోని దేవరాజ్ భవన్‌లో మహమ్మద్ అధ్యక్షతన ఏఐవైఎఫ్ అల్వాల్ మండల 3వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జెండాను కల్లూరు ధర్మేంద్ర ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహిస్తూ శాశ్వత ఉద్యోగాలను కుదిస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యా-వైద్య రంగాల వాణిజ్యీకరణతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు.

**యాదగిరిగుట్టలో రాష్ట్ర మహాసభలు:**

ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, కార్యదర్శి టి. సత్యప్రసాద్ మాట్లాడుతూ... సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు జరగనున్నట్లు వెల్లడించారు. విద్య, ఉపాధి హక్కుల సాధనకు ఈ మహాసభల్లో నూతన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ అల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు, ఏఐవైఎఫ్ నాయకులు పి. మహేష్, సోహైల్, రజనీకాంత్, గోపాలకృష్ణ, నూర్, శ్రీనివాస్, ప్రదీప్, కోమల, కిరణ్, మురహరి తదితరులు పాల్గొన్నారు.
ఏఐవైఎఫ్ అల్వాల్ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక మహాసభల ముగింపు సందర్భంగా అల్వాల్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్ మహమూద్,కార్యదర్శిగా పత్తి మహేష్, ఉపా ధ్యక్షులుగా సోహైల్, శ్రీనివాస్, రజనీకాంత్, సహాయ కార్య దర్శులుగా గోపాల్ కృష్ణ, వంశీ కోశాధికారిగా ఎండీ. ముక్త ధీర్ కౌన్సిల్ సభ్యులు 11 మంది ముషహీద్, శ్రీనివాస్, నూర్, నర్సింగ్, ప్రవీణ్ తదితరులు ఎన్నుకున్నారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

## సరూర్ నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే
## రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం
## ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు




హైదరాబాద్,ఆగస్ట్8(తెలంగాణవీణ):

హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరు ద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించి నందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

# పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నేలకొండపల్లి/ తెలంగాణ వీణ

పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాయగూడెం "సర్పంచ్ బోయిన వేణు సూచించారు. మండలం లోని రాయగూడెం లో శనివారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తాగునీటి సరఫరా మోటార్ల మరమ్మత్తుల ను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమతంగా ఉండాలని సూచించారు. ప్రజల దాహర్తిని తీర్చేందుకు పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చోరవతో గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం ఛేయాలని సూచించారు. ప్రతీ ఇంటింటికి వెళ్లి పథకాల వివరాలను తెలియజేయాలని సూచించారు. గ్రామాన్ని ఉత్తమ పంచాయతీ గా 'తయారు చేసేందుకు పాలకవర్గం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు " తెలిపారు. గ్రామంలో రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కుషాయిగూడలో వృద్ధురాలు అదృశ్యం...

తెలంగాణవీణ, కుషాయిగూడ :



గాంధీనగర్‌లో గుండె గౌరమ్మ (85) అనే వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చొటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గాంధీనగర్‌కు చెందిన గుండె కుమారస్వామి తన తల్లి గౌరమ్మతో కలిసి నివాసముంటున్నారు. ఈ నెల 7వ తేదీన ఉదయం కుమారస్వామి పనిమీద బయటకు వెళ్లి, సాయంత్రం సమయంలో ఇంటికి తిరిగి వచ్చారు. అయితే ఇంట్లో ఉండాల్సిన ఆయన తల్లి గౌరమ్మ కనిపించలేదు. కుటుంబ సభ్యులను, చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.,

# యువకుడి ఆత్మహత్య...

తెలంగాణవీణ, కుషాయిగూడ :

ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చొటుచేసుకుంది . పోలీసుల కథనం మేరకు... కైలాసగిరి, హెచ్‌బీ కాలనీలో ఎర్ర హరీష్ (29) అనే యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.జీహెచ్ఎంసీ స్వీపర్‌గా పనిచేస్తున్న ఎర్ర అంజమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హరీష్ వంట పని చేసేవాడు. గత రెండు నెలలుగా ఎలాంటి పని లేకపోవడంతో ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీన అంజమ్మ తన స్వగ్రామమైన లింగాల ఘన్‌పూర్‌లో వ్యవసాయ పనుల కోసం వెళ్లింది.శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చి చూడగా, లోపలి నుంచి డోర్ తెరుచుకోలేదు. దీంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు తీసి చూడగా, హరీష్ గదిలోని ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు.ఆర్థిక ఇబ్బందుల వల్లే తన కుమారుడు ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని మృతుడి తల్లి అంజమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు కుషాయిగూడ పోలీసులు వెల్లడించారు.

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

## వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
## సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట

హైదరాబాద్,ఆగస్ట్8(తెలంగాణవీణ):

నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు.

తెలంగాణవీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం

## కార్పోరేట్‌కు దాసోహమంటున్న మోడీ- సిపిఐ ప్రచారజాతాలో చాడ విమర్శలు




కరీంనగర్,ఆగస్టు8 (తెలంగాణవీణ):

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ పెట్టుబడుదారులను ప్రోత్సహిస్తూ సామాన్య ప్రజలను పెనుబారం మోపుతుందని సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ ప్రచార జాతలో భాగంగా చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, సుందరగిరి గ్రామాల్లో ప్రచార జాతలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్తో కలిసి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి దేశ అభివృద్ధి ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమం సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఏ ఒక్కటి అమలు చేయడం లేదని అన్నారు. నిత్యాసరాల పెంపు, పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్యాలకు భారంగా మారిందన్నారు. రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తే దేశ వ్యాప్తంగా ఆందోళన నిర్వహించి కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎండగడతామన్నారు. రైతులకు కనీసం మద్దతు ధర చట్టం తెస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పండించిన పంటలకు కనీసం మద్దతు చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని, ధరల పెంపులను నియంత్రించాలని, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల చట్టాలను పరిరక్షించుకోవాలని స్వయంగా సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ సమాన పనికి సమాన వేతనం కార్మికులకు అందించడంలో కేంద్ర విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందే స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుడి మృతదేహంతో ఆందోళన

బూర్గంపహాడ్,ఆగస్టు8 (తెలంగాణవీణ):

లారీ ప్రమాదంలో మృతి చెందిన ఐటీసీపీఎస్పీడీ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుడు గుగులోత్ శ్రీరామ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఐటీసీ గేటు వద్ద ఆందోళనకు దిగారు. విధులు ముగించుకుని వాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో ఐటీసీ సమీపంలో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే శ్రీరామ్ మృతిచెందాడు. యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న సర్పంచ్ గుగులోత్ కిషోర్నాయక్ ఐటీసీ గేటు వద్ద శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటానని, ఐటీసీ యాజమాన్యం న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# ఎపి కోసం తెలంగాణ నీళ్ల త్యాగం

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్

హైదరాబాద్,ఆగస్టు8 (తెలంగాణవీణ):

కర్నాటక, తదితర రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జూరాలకు భారీగా వరద వస్తోందని , వచ్చిన నీళ్లను వచ్చినట్లే తెలంగాణ ప్రభుత్వం మొత్తం ఏపీకి వదిలేస్తుందని బీఆర్ఎస్మాజీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్ష మాట్లాడారు. ఏపీ ప్రభుత్వంతో తెలంగాణలోని రేవంత్ ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుని, తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీ టూర్లపై ఉన్న దృష్టి పాలమూరు రైతులపై లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వర్షాలతో వరద ప్రారంభమైన వెంటనే మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లల్లో నీళ్లను నింపి, రైతులకు సమయానికి నీళ్లను అందించేదని స్పష్టం చేశారు. జూరాలకు వరద వచ్చి పదిహేను రోజులైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రిజర్వాయర్లలో నీళ్లను నింపే ప్రయత్నం కూడా చేయలేదని దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ పనిచేస్తున్నది తెలంగాణ రైతుల కోసమా? పక్క రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసమా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరినో సంతృప్తి పరచడానికే రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# సీతారామ నీళ్లను నిర్వాసితులకే అందించాలి

## బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు8 (తెలంగాణవీణ):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార సాగు భూములకు ప్రాణాధారమైన సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లను ముందుగా స్థానిక భూ నిర్వాసితులకే మళ్లించాలని, స్థానిక అవసరాలు తీర్చకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ అన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో శనివారం జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ?గోదావరి జలాలు తమ పొలాలకు మళ్లుతాయనే ఆశతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేశారన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా గత రెండు నెలలుగా ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించకుండా నాగార్జునసాగర్ కాలువల్లోకి జలాలను తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి ఉన్న స్థానిక ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన తర్వాతే మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులపై నిజమైన ప్రేమ ఉంటే, తక్షణమే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ?సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కింద నిర్వాసితులైన రైతులకు ఎకరానికి రూ.21 లక్షల చొప్పున నిధులు కేటాయించి చెల్లించాలని, సాగునీరు అందక నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అవకాశం ఉన్న ప్రతి చెరువుకూ సీతారామ జలాలను తక్షణమే విడుదల చేయాలని, రాబోయే రబీ సీజన్ నాటికి జిల్లాలోని ప్రతి వ్యవసాయ భూమికీ సాగునీరు అందేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ?మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఎరువుల సబ్సిడీ రూపంలో లక్షల కోట్లు భరిస్తూ ఒక్కో బస్తాపై సుమారు రూ.2,000 వరకు వెసులుబాటు కల్పిస్తోందని తెలిపారు. అయితే, కనీసం బస్తాకు అయ్యే రూ.20 నుండి రూ.30 రవాణా ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించకపోవడం శోచనీయమని, ఆ రవాణా ఛార్జీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, మండల అధ్యక్షులు బుక్యా రమేష్, నాయకులు సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సిరిపురపు పుల్లారావు, బయ్యవరపు వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

# 10న కలిదిండికి సిఎం చంద్రబాబు రాక

## రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న సిఎం

అమరావతి,ఆగస్ట్8(తెలంగాణవీణ):

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 10న ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంతో పాటు ప్రజా వేదిక, క్యాడర్ సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు ఉదయం 10:45 గంటలకి కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు చేరుకుంటారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలకనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు కలిదిండి తహసీల్దార్ కార్యాలయానికి ఆయన చేరుకుంటారు. 11 గంటల నుంచి 11:45 వరకు రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహిస్తారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారాల దిశగా చర్యలు చేపడతారు. ఆ తర్వాత కలిదిండిలో ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించనున్నారు. ఉదయం 11:55 నుంచి మధ్యాహ్నం 2:05 వరకు ప్రజా వేదిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 2:55 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహిస్తారు. 2:55 నుంచి సాయంత్రం 4:25 వరకు క్యాడర్ సమావేశంలో పాల్గొని వారికి దిశానిర్దేశర చేయనున్నారు. సాయంత్రం 4:35 గంటలకు కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం 4:40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 4:55 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు.

# నేడు నర్సంపేటకు మాజీ సిఎం కెసిఆర్

## పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శ

వరంగల్,ఆగస్టు8 (తెలంగాణవీణ):

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు నర్సంపేటకు రానున్నారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కేసీఆర్ విషాదంలో మునిగిపోయారు. ఈ క్రమంలో తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించ డానికి ఆయన నర్సంపేట రానున్నారు. ఈ మేరకు, ఆదివారం నాడు నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి బయలుదేరి వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా, ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులై వున్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్ట కాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో, నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయ కులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం ఇవ్వనున్నారు. కాగా, పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్ గారు, ఇప్పటికే 2 కోట్ల 25 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం ప్రకటించారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరపున రెండు కోట్ల 25 లక్షల రూపాయల లను అందజేయాలని నిర్ణయించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగానే సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. అలాగే పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ



ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# 17 నుంచి ఎపి శాసనభ సమావేశాలు

అమరావతి,ఆగస్ట్8(తెలంగాణవీణ):

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 17వ తేదీన ఉదయం 10 గంటలకు శాసన మండలి మొదలు కానుంది. ఈ మేరకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలి సెషన్ సమావేశానికి అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు 50వ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 17వ తేదీ ఉదయం ఉభయ సభల బీఏసీలు సమావేశం కానున్నాయి. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలి, అజెండాను ఉభయ సభల బీఏసీలు ఖరారు చేయనున్నాయి.

# అత్యవసర సమయాల్లో సిపిఆర్ ఆవశ్యకం

## సిపిఆర్‌తో వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు

## కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు8 (తెలంగాణవీణ):

గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి అత్యవసర సమయంలో సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ అన్నారు. జీ.ఎం ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు శిక్షణ కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తిని గుర్తించడం, స్పందన, శ్వాసను పరిశీలించడం, అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం, ఛాతీపై కంప్రెషన్స్ చేయడం, అవసరమైన సందర్భాల్లో ఏఈడీ పరికరాన్ని వినియోగించడం వంటి అంశాలపై శిక్షకులు అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి, సరైన విధానాన్ని ఎంఆర్ఎస్ సిబ్బంది వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని, వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని శిక్షకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఇన్‌చార్జ్ ఎంఆర్ఎస్ అనంతరామయ్య, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ సి.హెచ్. సాగర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కె. సౌజన్యతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# మహిళా ఎస్ఐపై దాడి కేసు

## వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అరెస్ట్

శ్రీకాకుళం,ఆగస్ట్8(తెలంగాణవీణ):

శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను ఏపీ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. చిలకపాలెం వద్ద రవిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఎస్ఐపై దాడి కేసులో అతను ఏ-1గా ఉన్నారు. పది రోజులుగా పోలీసులు కళ్లుగప్పి రవి తిరుగుతున్నాడు. గత నెల 30వ తేదీన మాజీమంత్రి అప్పలరాజు ములాఖత్ కోసం వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా భారీగా కార్యకర్తలతో జగన్‌కు స్వాగతం పాలకటానికి చింతాడ రవి వచ్చాడు. కొట్టూరోడ్డు వద్ద బందోబస్తులో ఉన్న మహిళా ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించటంతో పాటు అసభ్యంగా రవి, అతని అనుచరులు వ్యవహరించారు. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ క్రమంలోనే చింతాడ రవితో పాటు 28 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నాడు. రవి కోసం విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలించారు. ఇవాళ సాయంత్రం 7 గంటల సమయంలో ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద చింతాడ రవికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# బాబాయి మృతిని తట్టుకోలేక అబ్బాయి ఆత్మహత్య

**ఒంగోలు,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

ప్రకాశం జిల్లా కంభంలో తీవ్ర విషాదం ఘటన చోటుచేసుకుంది. బాబాయి మృతి చెందడాన్ని తట్టుకోలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాబాయి మణికుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న క్లైమ్ బాబు అనే యువకుడు.. తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధలోనే కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఒకే కుటుంబంలో వరుసగా ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మణికుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మణికుమార్ మృతి చెందారు. బాబాయి మృతి వార్త క్లైమ్ బాబును తీవ్రంగా కలిచివేసినట్లు తెలుస్తోంది. బాబాయితో ఉన్న అనుబంధం కారణంగా ఆయన మృతిని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన బాబు.. కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణికుమార్, ÷–లక్లైమ్ బాబు మృతదేహాలకు కుటుంబ సభ్యులు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి జరగడం చూసి స్థానికులు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన కంభం ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# మంగాపురం వద్ద వాచ్‌మెన్ దారుణ హత్య

## ఇంట్లోకి దూరి గొంతు కోసిన దుండగులు

**చిత్తూరు,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

చిత్తూరు రూరల్ మండలం మంగాపురం వద్ద దారుణ హత్య కలకలం రేపింది. ఎన్ఆర్ఐ పట్టాభి నాయుడు ఇంటి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆనందరావు (50)ను గుర్తుతెలియని దుండగులు కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఇంటి అద్దాలను నాటుబాంబుతో పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు.. వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిత్తూరు డీఎస్పీ వెంకటనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అసలు దుండగులు ఇంట్లోకి ఎందుకు చొరబడ్డారన్నది దర్యాప్తు చేస్తున్నారు. వాచ్‌మెన్ ఆనందరావును ఎందుకు హత్య చేయడం దొంగతనం కోసమే వచ్చారా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలను నిగ్గు తేల్చేందుకు ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

## పూర్తిస్థాయి జలమట్టానికి చేరువలో నీటిమట్టం

**శ్రీశైలం,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2,32,308 క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 876.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 169.46 టీఎంసీలకు చేరింది.ఈ క్రమంలో అధికారులు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి చేసి 66,460 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,133 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం పరవళ్లు తొక్కుతున్నా సాగర్‌కు విడుదల కావడం లేదు. ఒకవైపు కృష్ణా, భీమా నదులు పొంగిపొర్లుతూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తుంటే రాష్ట్ర సర్కార్ పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయకుండా దోబూచులాడుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మరో నాలుగు మోటర్లతో కూడా నీటిని ఎత్తిపోయొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు ప్రాజెక్టులకు నీటిని వదలకుండా కృష్ణా జలాలను వృథాగా దిగువకు వదిలిపెడుతున్నదని పాలమూరు నేతలు మండిపడుతున్నారు. ఇదిలావుంటే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు 42,114 క్యూసెక్కుల ఇన్ ఎ÷–లో కొనసాగింది. ప్రస్తుతం డ్యాంలో 1,623.68 అడుగులకు గాను 72.26టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. తాగునీటి అవసరాలు కోసం వివిధ కాల్వలకు 1,514 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగునీటి విడుదలపై ఈనెల 11 తేదీన కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# ఫీజు కోసం వేధింపులు.. విద్యార్థి ఆత్మహత్య

**కాకినాడ,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల సిబ్బంది వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ జగన్నాథపురంలోని జె.రామారావుపేట సమ్మెటవారి వీధికి చెందిన పైలా రాంబాబు, జ్యోతి దంపతుల రెండో కుమారుడు పైలా అరవింద్ (15) స్థానికంగా ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు.శుక్రవారం అరవింద్, అతడి తండ్రి మొదటి టర్మ్ ఫీజు కట్టేందుకు కళాశాలకు వెళ్లినప్పుడు.. చాలామంది సెకండ్ టర్మ్ కూడా కట్టేశారని, మీరు ఇంకా మొదటి టర్మ్ ఫీజే కట్టలేదని సిబ్బంది అనడంతో వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అరవింద్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# వివేకా హత్యకేసు విచారణలో అవకతవకలు

## మరోమారు వైఎస్ సునీత ఆరోపణలు

**కడప,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కుమార్తె వైఎస్ సునీతా రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసు విచారణలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. శనివారం వైఎస్ వివేకా 75వ జయంతి సందర్భంగా పులివెందుల్లోని వివేకా సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం సునీత మీడియాతో మాట్లాడుతూ.. 'నా తండ్రి వివేక హత్య కేసు విషయంలో గత ఆరునెలల కాలంగా జడ్జిమెంట్లు కూడా సరిగా లేవని నా అభిప్రాయం. విచారణలో అవకతవకలు ఉండడం వల్లే ఇన్నిసార్లు కోర్టుమెట్లు ఎక్కాల్సి వచ్చింది' అని చెప్పుకొచ్చారు. ఏదో ఒకరోజు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో పోరాటం కొనసాగిస్తూనే ఉంటానని సునీత అన్నారు. వివేక హత్య జరిగిందని అందరికంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే తెలుసు అని సునీత పేర్కొన్నారు.

# టీచర్లపై బురదజల్లే చర్యలు సహించడం

మెగా డిఎస్సీని ..
దగా డిఎస్సీ అంటే ఎలా
అసలు డిఎస్సీ అంటే ర్జతం
తెలియని వరే విమర్శలు
కష్టపడి చదివి ఉద్యోగాలు
సంపాదిస్తే నిందలేస్తారా
కర్నూలు కొండారెడ్డి బురుజు
వద్ద డిఎస్సీ టీచర్ల ధర్నా

**కర్నూలు,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

వైకాపా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరుతూ మెగా డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు కదం తొక్కారు. కడప, అనంతపురం నుంచి భారీగా చేరుకున్న టీచర్లు కర్నూలు కొండారెడ్డి బురుజు నుంచి జెడ్పీ కార్యాలయం వరకు ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుల నియామకాలపై కుట్రలు చేయొద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వాస్తవాలు వివరించినా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు చేసిన వారికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.మెగా డీఎస్సీపై వైకాపా కుట్రలను తిప్పి కొట్టేందుకే శనివారం చలో కర్నూలు కార్యక్రమాన్ని చేపట్టామని ఉపాధ్యాయులు తెలిపారు. 2025 మెగా డీఎస్సీలో తాము కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే ఓర్చుకోలేని వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దగా డీఎస్సీ అంటే టీచర్లందరూ వైసీపీపైన యుద్ధం చేస్తారని వార్నింగ్ ఇచ్చారు. మెగా డీఎస్సీ నిర్వహించిన మంత్రి నారా లోకేశ్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. డీఎస్సీ అంటే చంద్రబాబు... చంద్రబాబు అంటే డీఎస్సీ అని తెలిపారు. టీచర్లపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్తామంటూ ఉపాధ్యాయులు హెచ్చరించారు. వైకాపా ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ ప్రకటన లేక ఎంతోమంది నిరుద్యోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకంతో 16 వేలకు పైగా డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. వైకాపా తప్పుడు ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు. జిల్లాలోని కొండారెడ్డి బురుజు నుంచి మెగా డీఎస్సీ 2025 ఆత్మ గౌరవ ర్యాలీ ప్రారంభమైంది. ఉపాధ్యాయుల హక్కు – న్యాయమైన నియామకాలకు మద్దతు అంటూ ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. మెగా డీఎస్సీ నియామకాలపై జరుగుతోన్న తప్పుడు ప్రచారం, నిరాధార ఆరోపణలను ఖండిద్దాం అంటూ ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన వందలాది నూతన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. కర్నూలు కొండారెడ్డి బురుజు నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగనుంది. కర్నూలు నడిబొడ్డున కొండారెడ్డి బురుజు వద్ద 'థ్యాంక్యూ సీఎం సార్... థ్యాంక్యూ మినిస్టర్ నారా లోకేశ్' అంటూ టీచర్స్ నినాదాలు చేశారు. కొండారెడ్డి బురుజుపైకి ఎక్కిన ఉపాధ్యాయులు.. వైసీపీకి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. 'కష్టపడి చదివి ఉద్యోగాలు పొందాం... ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు. మాపై వైసీపీ దుష్ప్రచారం చేయడం తగదు' అంటూ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ అంటే మీనింగ్ తెలియని వాళ్లు తమపై ఆరోపణలు చేస్తున్నారని ఉపాధ్యాయులు మండి పడ్డారు. గత ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వని వారు నేడు విమర్శించడం సిగ్గు చేటన్నారు. డీఎస్సీ పరీక్షలు రాయని వారు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు.. ఆరు నెలల్లో నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులతో పెట్టుకొని 11 సీట్లకు పరిమితమైందని.. టీచర్స్‌ను అవమానిస్తే వచ్చే ఎన్నికల్లో వైసీపీ పీఠం మళ్లీ కదిలిస్తామని హెచ్చరించారు.

# మహిళా ఎస్ఐ పట్ల అసభ్య ప్రవర్తన

## వైకాపా నేత చింతాడ రవికోసం గాలింపు


**శ్రీకాకుళం,ఆగస్ట్8(తెలంగాణవీణ):**

జిల్లాలోని ఆమదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రవి కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పోలీసులు గాలిస్తున్నారు. మహిళా ఎస్ఐపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో రవికుమార్ పరారీలో ఉన్నారు. ఇటీవల వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆముదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జి చింతాడ రవి.. మహిళా ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించారంటూ ఓ వీడియో బయటకు వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ నేత సహా 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రవి ఏ1గా ఉన్నారు. జగన్ పర్యటన అనంతరం గత పది రోజులుగా అరెస్ట్ భయంతో వైసీపీ నేతతోపాటు అనుచరులంతా అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. రవిని అరెస్ట్ చేసేందుకు విస్తృతంగా గాలిస్తున్నారు. నిన్నటి నుంచి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి వైసీపీ నేత ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 21 మందిలో నిన్న రాత్రి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేశారనే ఉద్దేశంతో రవితో పాటు 21 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో వైసీపీ నేతను ఏ క్షణంలో అయినా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**కలిదిండి, ఆగస్టు 08 (తెలంగాణవీణ):**

కైకలూరు నియోజకవర్గం కలిదిండి గ్రామంలో ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ముందస్తు ఏర్పాట్లను శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి పార్థసారధి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండు హెలిప్యాడ్ , అగ్రికల్చర్ మార్కెటు కమిటీ కార్యాలయం ప్రక్కన ఖాళీస్థలంలో ప్రజావేదిక, అగ్రికల్చర్ మార్కెటు కమిటీ కార్యాలయం క్యాడరు మీటింగు సభాస్థలి, తదితర ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. రాష్ట్ర మంత్రితో పాటు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, ముఖ్యమంత్రి భద్రతా అధికారులు, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన కలిదిండి మండలంలో "మీ భూమి–మీహక్కు'రాజముద్రతో రూపొందించిన పట్టదారు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఏ గ్రామం పర్యటించినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పట్ల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గత పాలకులు రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా విధ్వంసం సృష్టించారన్నారు. రాష్ట్రంలో అందరి సంక్షేమం, అన్ని ప్రాంతాలు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చి ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. రెవెన్యూ శాఖలో చేసిన విధ్వంసం కారణంగా దానిని పునరుద్ధరించడానికి ఇన్ని నెలలు పట్టిందని, ప్రజలు ఆస్తులకు భరోసా, ప్రజలు జీవితాలకు విశ్వాసం కల్పించాలన్న కారణంగా రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు మీ ఆస్తిపై వారి బొమ్మలు వేసుకున్నారని, ఆస్తిమీది, ఫోటో ఆయనది అన్నారు. సరిహద్దు రాళ్లపై కూడా ఆయన బొమ్మ చెక్కించుకున్నారని, 77 ఏళ్ల చరిత్రలో ఇలాంటి వ్యక్తిని ఎప్పుడూ చూడలేదని అన్నారు. 2019–24 మధ్య జరిగిన వ్యవహారాలు కారణంగా పెద్ద ఎత్తున భూవివాదాలు వచ్చాయని, మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు నుంచి వచ్చిన అర్జీల్లో ఎక్కువ శాతం భూ సమస్యలేనని అన్నారు. అందుకే శాశ్వతంగా భూసమస్యల్ని పరిష్కారం చేసి భూమిని హక్కుగా మీకు కల్పించాలనే ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. గతపాలకులు ల్యాండు టైటిలింగు యాక్టు ద్వారా బెదిరించి మీ ఆస్తుల్ని కాజేయాలని చూశారని, మేము అధికారంలోకి వస్తూనే ఆ చట్టాన్ని రద్దుచేసి న్యాయం చేశామని అన్నారు. సచివాలయం లోనే భూమి రికార్డులకు సంబంధించిన వివరాలను సరిచేసుకునే అవకాశాన్ని కూడా స్వర్ణవార్డు, స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో చేసుకోవచ్చునని అన్నారు. ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జిల్లా, డివిజన్, మండల వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 10వ తేదీన జైల్‌భరో కార్యక్రమం

**ఏలూరు, ఆగస్టు 8 (తెలంగాణవీణ):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఆగస్టు 10వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు మరియు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్లో ఉదయం 10 గంటలకు జరుగు నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు కార్మికులు పాల్గొనవలసిందిగా ఏఐటియుసి ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే పిలుపునిచ్చారు. ఆగస్టు 10 తేదీన జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఉదయం స్థానిక కోట దిబ్బ సర్వీస్ రిజర్వాయర్ ఒకటి వద్ద మస్తార్ సమయంలో ఏఐటియుసి నాయకులు మరియు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నాయకత్వం లో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం మరియు రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందాయన్నారు.తమ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సిబ్బంది ని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చాయని వారు తెలిపారు. ఇచ్చిన హామీ ని అమలు చేయకుండా ఔట్సోర్సింగ్ మరియు కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందితో ప్రభుత్వాలు పెట్టి సాకిరి చేయించుకుంటున్నాయని వారు విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం 35 వేల రూపాయలు ఇవ్వాలని కేంద్ర కార్మిక సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాయని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 11వ పిఆర్సి బకాయిలను తక్షణమే చెల్లించి, 12వ పిఆర్సి కమిషన్ వేయాలని, ఈలోగా ఐ ఆర్ 30 శాతం ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల, కార్మికుల హక్కులను హరించి వేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 10 న జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఏలూరు కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఏలూరు కార్పొరేషన్ లో ఇంజనీరింగ్ విభాగం వాటర్ సప్లై లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ మరియు కాంట్రాక్టు సిబ్బందికి కనీస వేతనం 26 వేలు తప్పకుండా ఇవ్వాలని ఏ అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రసార కార్యక్రమంలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి నారాయణరావు, ఎస్.కె అలీ, పి దుర్గారావు, ఎస్ గౌరీ శంకర్, ఎమ్మెస్ బాజీ, బి.కె డి వి ప్రసాద్, ఎస్ వెంకన్న, టి రామారావు, ఎస్ఎంవి సుబ్బారావు, సిహెచ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.




# ఏపీటీడీసీ ఆధ్వర్యంలో టూర్ ప్యాకేజీ

## విజయవాడ - వాడపల్లి- విజయవాడ ఒక రోజుటూర్

## జండా ఊపి ప్రారంభించిన ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ

**విజయవాడ, ఆగస్టు 8 (తెలంగాణవీణ):**

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో విజయవాడ– వాడపల్లి – విజయవాడ వాహన బస్సును శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రం వద్ద ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు, పర్యాటకులకు అధునాతన సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించటంలో భాగంగా ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన అన్నారు. ప్రతీ శనివారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటామన్నారు. ప్యాకేజీ ధర పెద్దలకు రూ. 1,160/–, పిల్లలకు రూ. 1,000/– గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో బస్సు రవాణా ఛార్జీలతో పాటు ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన వసతి కలిగి ఉంటాయని అన్నారు. ఆలయ దర్శనం టికెట్ ఛార్జీలను పర్యాటకులే స్వయంగా భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు మరియు పర్యాటకులు www.aptdc.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని జనరల్ మేనేజర్ టి ఎస్ వి నారాయణ తెలిపారు.

తెలంగాణవీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
09 ఆదివారం, ఆగస్టు 2026
www.epaper.telanganaveena.in



# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల




రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బ్జడెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది
## సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు.త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.




# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణెళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.



# 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ



హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.



# ఆసుపత్రి పాలైన అవికా గోర్.. 104 డిగ్రీల జ్వరంలోనూ షూటింగ్ చేసిన 'చిన్నారి పెళ్లికూతురు'

టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది.ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.




## ట్రావిస్ హెడ్‌కు అలన్ బోర్డర్ మెడల్

### వరుసగా రెండో ఏడాది హెడ్ కైవసం

ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ప్రతిష్టాత్మక అవార్డ్ వరించింది. ఆస్ట్రేలియా అత్యున్నత పరుస్కారమైన అలన్ బోర్డర్ మెడల్‌ను వరుసగా రెండో ఏడాది కూడా ట్రావిస్ హెడ్ కైవసం చేసుకున్నాడు. బ్రిస్బేన్ వేదికగా జరిగిన క్రికెట్ ఆస్ట్రేలియా అవార్డుల కార్యక్రమంలో దిగ్గజ కెప్టెన్ అలన్ బోర్డర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఈ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అందుకున్నాడు. దాంతో వరుసగా రెండో ఏడాది అలెన్ బోర్డర్ మెడల్ అందుకున్న ఐదో ఆసీస్ ప్లేయర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాళ్లు అయిన రికీ పాంటింగ్, మైఖేల్ క్లార్క్, డేవిడ్ వార్నర్, షేన్ వాట్సన్ సరసన చేరాడు.ఈ ప్రతిష్టాత్మక అవార్డు కోసం జరిగిన ఓటింగ్‌లో ట్రావిస్ హెడ్ కేవలం ఒక్క ఓటు తేడాతో గెలుపొందడం గమనార్హం. తన సహచర ఆటగాడు, ఆస్ట్రేలియా వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీ 152 ఓట్లతో రెండో స్థానంలో నిలిచి తృటిలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును కోల్పోయాడు. ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ 150 ఓట్లతో మూడో స్థానంలో నిలిచాడు. 2025 జనవరి 29 నుంచి 2026 జనవరి 8 వరకు ఉన్న ఓటింగ్ వ్యవధిలో ట్రావిస్ హెడ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు.గతేడాది ఆస్ట్రేలియా తరఫున మూడు ఫార్మాట్లలో 30 మ్యాచ్‌లు ఆడిన ట్రావిస్ హెడ్.. 1,437 పరుగులు సాధించి ఆసీస్ తరఫున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా యాషెస్ సిరీస్‌లో మూడు సెంచరీలతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇదే కార్యక్రమంలో షేన్ వాట్సన్ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా మిచెల్ స్టార్క్, వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా మిచెల్ మార్ష్, టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా టిమ్ డేవిడ్ అవార్డులు అందుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన ట్రావిస్ హెడ్.. అలన్ బోర్డర్ సమక్షంలో వరుసగా రెండోసారి ఈ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పాడు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నాడు. అప్‌కమింగ్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్‌లపైనే తన పూర్తి దృష్టి ఉందని స్పష్టం చేశాడు.

## మెస్సీ ఇంట విషాదం..

## తండ్రిని కోల్పోయిన ఫుట్‌బాల్ దిగ్గజం..!

ఫుట్‌బాల్ మాంత్రికుడు లియోనల్ మెస్సీ ఇంట విషాద నెలకొంది. మెస్సీ తండ్రి జార్జ్ మెస్సీ కన్నుమూశాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన 68 ఏళ్ల వయసులో మరణించాడు. తమ సొంత ప్రదేశమైన రొసారియోలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జార్జ్ శుక్రవారం మరణించాడని మెస్సీకి చెందిన క్లబ్ వెల్లడించింది.సాకర్ ప్రపంచంలో తన కొడుకును రారాజులా చూసి ఎంతో గర్వపడిన జార్జ్ మెస్సీ అనారోగ్యంతో కన్నుమూశాడు. ఫిఫా వరల్డ్‌కప్ 2026 సమయంలోనే ఆయన ఆస్పత్రి పాలయ్యారు. కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన.. ఆగస్టు 7వ తేదీ, శుక్రవారం చనిపోయాడు. ఈ విషయాన్ని మెస్సీకి సంబంధించిన బాయ్‌హుడ్ క్లబ్ న్యూవెల్స్ ఓల్డ్ బాయ్స్ అధికారికంగా వెల్లడించింది.'క్లబ్ అట్లెటికో బరువైన హృదయంతో జార్జ్ మెస్సీకి వీడ్కోలు పలుకుతోంది. రొసారియో పట్టణంలోని ఓ ఆస్పత్రిలో జార్జ్ మరణించాడు. ఆయనకు 68 ఏళ్లు. వ్యాపారవేత్త అయిన జార్జ్ కుమారుడు మెస్సీని గొప్ప ఫుట్‌బాలర్‌గా తీర్చిదిద్దాడు' అని న్యూవెల్స్ ఓల్డ్ బాయ్స్ పేర్కొంది.



## వామప్ మ్యాచ్‌లో పోరాడుతోన్న భారత్



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. భారత్ ఇంకా శ్రీలంక కంటే 6 పరుగుల వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విశ్వ ఫెర్నాండో వేసిన తొలి ఓవర్ రెండో బంతికే యశస్వి జైస్వాల్(0).. దిలుమ్ సుదీర్‌కు క్యాచ్ ఇచ్చి సిల్వర్ డక్‌గా వెనుదిరిగాడు. వైడ్‌బాల్‌ను వెంటాడి మరీ మూల్యం చెల్లించుకున్నాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో పాటు, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడి రెండో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీకి చేరువైన కేఎల్ రాహుల్(40)ను నువాంత క్లీన్ బౌల్డ్ చేశాడు.రవీంద్ర జడేజా సాయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన దేవదత్ పడిక్కల్ 121 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ మరుసటి బంతికే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దాంతో క్రీజులోకి రిషభ్ పంత్ వచ్చాడు. కానీ అతను ఐదు బంతుల్లో 2 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్ కూడా ఆ కాసేపటికే క్యాచ్ ఔటయ్యాడు. ఈ ఇద్దరినీ స్పిన్నర్ రమేష్ మెండీస్ పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 174 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో జడేజా, మానవ్ సుతార్ జట్టును ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ అనంతరం రవీంద్ర జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. కుల్దీప్ యాదవ్(1) గాయంతో తప్పుకున్నాడు. మహమ్మద్ సిరాజ్(1) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. సరాన్ష్ జైన్(22) పరుగుల తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. దేవదత్ పడిక్కల్ తిరిగిన బ్యాటింగ్‌కు వచ్చాడు. గుర్నూర్ బ్రార్‌తో కలిసి అతను రెండో రోజు ఆటను ముగించాడు.

# టీమిండియాకు గాయాల బెడద

శ్రీలంక పర్యటనలో ఉన్న టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో ఈ పర్యటనకు దూరం కాగా.. జాగా ఈ జాబితాలో సాయి సుదర్శన్ చేరాడు. కాలి బొటన వేలి గాయంతో ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భారత్-ఏ తరఫున శ్రీలంక-ఏతో జరిగిన సిరీస్‌లో సాయి సుదర్శన్ కాలి వేలికి గాయమైంది. అయినా శ్రీలకంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సాయి సుదర్శన్‌ను ఎంపిక చేసిన సెలెక్టర్లు.. ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సిరీస్‌లో కొనసాగుతాడని తెలిపారు. అయితే తాజాగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో సాయి సుదర్శన్ గాయం తగ్గలేదని తేలింది. దాంతో అతను ఈ సిరీస్ మొత్తానికి దూరం కావాల్సి వచ్చింది. అయితే సాయి సుదర్శన్ దూరమవ్వడంపై బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆ సమయంలోనే అతనికి రిప్లేస్‌మెంట్‌గా మరో ఆటగాడిని ఎంపిక చేయవచ్చు. సాయి సుదర్శన్ స్థానంలో తెలుగు తేజం షేక్ రషీద్‌ను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మెరుగైన రికార్డ్ ఉంది. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్‌గా అతని రికార్డ్స్ మెరుగ్గా ఉన్నాయి. ఇప్పటి వరకు 29 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన షేక్ రషీద్ 46.64 సగటుతో 1959 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలతో పాటు 10 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇటీవల శ్రీలంక-ఏ జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లోనూ షేక్ రషీద్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 63, 20, 45 పరుగులతో రాణించాడు. అయితే షేక్ రషీద్‌కు సర్ఫరాజ్ ఖాన్‌తో పోటీ నెలకొంది. అయితే ఐపీఎల్ తర్వాత సర్ఫరాజ్ ఖాన్ ఎలాంటి ప్రొఫెషనల్ క్రికెట్ ఆడలేదు. సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం లభిస్తుంది. సెలెక్టర్లు సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు షేక్ రషీద్ పేర్లను సాయి సుదర్శన్‌కు రిప్లేస్‌మెంట్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రుతురాజ్ గైక్వాడ్ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

## హెడ్‌కోచ్‌గా వైదొలిగిన ఇంగ్లండ్ వెటరన్.. కారణమిదే..!



ఇంగ్లండ్ వెటరన్ ఆండ్రూ ఫ్లింటాఫ్ కోచింగ్ బాధ్యతల నుంచి వైదొలిగాడు. తమ దేశానికి చెందిన జూనియర్ టీమ్ ఇంగ్లండ్ లయన్స్‌కు కోచింగ్ ఇస్తున్న ఈ మాజీ ఆల్‌రౌండర్ తన పదవికి రాజీనామా చేశాడు. రెండేళ్లుగా ఆ జట్టును తీర్చిదిద్దిన ఫ్లింటాఫ్ ఆగస్టు 8, శనివారంతో తన సేవలకు స్వస్తి పలికాడు. ఇకపై ఫ్రాంచైజీ క్రికెట్‌లో కోచ్‌గా కొనసాగనున్నాడీ దిగ్గజం.మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రూ ఫ్లింటాఫ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. స్వదేశంలోని ఇంగ్లండ్ లయన్స్ జట్టుకు ప్రధాన కోచ్ పదవికి గుడ్ బై చెప్పేసిన అతడు ఫ్రాంచైజీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై జరిగే బిగ్‌బాష్ లీగ్‌లోని జట్లలో ఒకటైన సిడ్నీ థండర్స్ హెడ్‌కోచ్‌గా నియమితులయ్యాడు.'లయన్స్ కోచ్‌గా వైదొలగాలని దురదృష్టవశాత్తూ నిర్ణయం తీసుకున్నా. దేశంలోని యువ క్రికెటర్లతో సమయం గడపడం, వారికి శిక్షణ ఇచ్చే అవకాశాన్ని నేను ఎంతో ఆస్వాదించాను. వారిని మరింత ఉన్నత స్థాయిలో చూడాలనుకున్నా. తదుపరి సిడ్నీ థండర్స్‌కు ప్రధాన కోచ్‌గా సేవలందించేందుకు నేను ఇక వేచి ఉండలేకపోతున్నా' అని ఫ్లింటాఫ్ పేర్కొన్నాడని ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసీబీ) వెల్లడించింది. లయన్స్ హెడ్‌కోచ్‌గా 2004 సెప్టెంబర్‌లో ఫ్లింటాఫ్ బాధ్యతలు చేపట్టాడు.



## లియోనల్ మెస్సీ హత్యకు కుట్ర..

ఇటీవల ముగిసిన ఫిఫా ప్రపంచకప్ 2026 సందర్భంగా అర్జెంటీనా స్టార్, ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ హ్యాతకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఈ అర్జెంటీనా దిగ్గజాన్ని లక్ష్యంగా చేసుకొని టెర్రర్ అటాక్ ప్లాన్ చేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. లియోనెల్ మెస్సీని హత్య చేయాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని స్పానిష్ న్యూస్ పేపర్ కథనం ప్రచురించింది. ఇందుకు సంబంధించిన పక్కా సమాచారం అమెరికా పోలీసుల వద్ద ఉందని పేర్కొంది. అయితే ఈ ప్రయత్నాలను అమెరికా ఎఫ్‌బీఐ, అంతర్జాతీయ పోలీస్ సహకార విభాగం నేతృత్వంలోని సెక్యూరిటీ నెట్‌వర్క్ సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని ఆ కథనంలో తెలిపింది. ఆత్మహుతి దాడితో మెస్సిని చంపాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని వెల్లడించింది. మెస్సి హ్యాతకు సంబంధించి ఓ దుండగుడు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ పెట్టినట్లు కూడా ఆ కథనంలో పేర్కొన్నారు. 'నా శరీరానికి నాలుగు బాంబులు పెట్టుకొని మెస్సీని పేల్చేసేందుకు అట్లాంటా స్టేడియానికి వెళ్తున్నా'అని నిందితుడు పోస్ట్ పెట్టి తొలిగించినట్లు సమచారం. ఈ పోస్ట్‌తో అప్రమత్తమైన భద్రతా అధికారులు ఉన్నత స్థాయిలో సమీక్షించి కఠిన చర్యలు తీసుకున్నట్లు స్పానిష్ పత్రిక వెల్లడించింది. డాలస్ ఎయిర్ పోర్ట్‌కు వచ్చిన ఓ ఫోన్ కాల్‌ను కూడా అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇంట్లో తయారు చేసిన బాంబులతోపాటు ఏఆర్-15 తుపాకీతో స్టేడియానికి వెళ్తున్నట్లు ఆ అనుమానితుడు పేర్కొన్నాడని ఆ కథనంలో రాసుకొచ్చారు. మెస్సితో పాటు ఇతర క్రీడాకారులు, పోలీస్ అధికారులను కూడా లక్ష్యంగా చేసుకున్నారని భద్రతా సిబ్బంది గుర్తించారు. లియోనెల్ మెస్సీతో పాటు క్రిస్టియానో రొనాల్డో కూడా వారి జాబితాలో ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. పోర్చుగల్ ఫుట్‌బాల్ టీమ్ బస ఎక్కడని ఆరా తీసినట్లు కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. దాంతో అప్పటి నుంచి భద్రతపరంగా అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. చివరికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఫిఫా ప్రపంచకప్ ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ విజేతగా నిలవగా.. అర్జెంటీనా రన్నరప్‌తో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే.


Edited & Printed by:Vulloju Srinivas Published & Owned by:Shabari Media House Plot No. 3-421,Journalist Colony,Dammaiguda,Keesara Circle,Medchel Malkajgiri, 500083
RNI NO : TGTEL/25/A4103 Contact : 9848588616 Email : vsrinivasetv@gmail.com